వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కామాటిపురలో 100 పడకల ఆస్పత్రి, చార్మినార్‌లో ప్రభుత్వ నిజామియా టీబీ కాలేజీ, నిజామియా జనరల్ ఆస్పత్రిలో పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులు, కొత్త బ్లాకల నిర్మాణం, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్, టాయిలెట్స్ బ్లాక్స్, యాకుత్‌పురాలోని ఎస్ఆర్‌టీ కాలనీలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడ ఏరియా ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రి, డబీర్‌పుర ఏరియా ఆస్పత్రిలో 100 పడకలు, బార్కాస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ పనులు, లాలాపేట్ 30పడకల అర్బన్ హెల్త్ కేర్ సెంటర్, అడ్డగుట్ట 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు, నల్లకుంట ఓపీడీ బ్లాక్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్, ఎర్రమంజిల్ ఎంసీహెచ్‌లో 200 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్టీ కోఠి హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, సీతాఫల్‌మండిలో 30 పడకల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తదితర పనుల పురోగతిపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీర్లు, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్ఓలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ మొదలుకాని వాటికి వెంటనే టెండర్లను పిలవాలని, నిర్మాణం మొదలైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో టీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతిరావు, డీఎంహెచ్ఓ వెంకట్, డీసీహెచ్ఎస్ సునీత, టీజీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.నాయుడు, డీఈ పి. జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవం

ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు.

వీసీల నియామకాల్లో బీసీలకు 50% కేటాయించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు త్వరలో చేపట్టనున్న వైస్‌చాన్స్‌లర్‌ల నియామకాల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో 2400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టులలో కూడా 50 శాతం పదవులు బీసీలకు కోటా ఇవ్వాలని కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.అనంతయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జేఎన్‌టీయూ, పాలమూరు, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీ వీసీ పోస్టులను బీసీలకు కేటాయించాలని, ఉన్నత విద్యామండలి చైర్మన్ పదవిలో కూడా బీసీనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, రాజేందర్, మల్లేష్‌యాదవ్, మోదీరాందేవ్ పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో కేన్సర్‌పై సదస్సు



బసవతారకం ఆస్పత్రిలో జరిగిన సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన కేన్సర్ వ్యాధులకు మంచి చికిత్స అందించే వీలు ఏర్పడిందని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులు, రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయ పేర్కొన్నారు. శనివారం బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో కేన్సర్‌పై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నోరి దత్తాత్రేయ, బసవతారకం ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడారు. సార్కోమా అనే ఎముకలు, మృదు కణజాలాలలో కొవ్వు, కండరాలు, రక్త నాళాలు, నరాలు, లోతైన చర్మ కణజాలాలు, పీచు కణజాలాలలో అభివృద్ధి చెందే అరుదైన కేన్సర్‌పై అవగాహన కలిగించడం, వ్యాధిని గుర్తించడం, ఎలాంటి చికిత్స అందించలనే అంశాలపై ఈ సదస్సులో నిపుణులు చర్చించారు. మెడికల్ డైరెక్టర్, డాక్టర్ టీఎస్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఫణికోటేశ్వరరావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, చెన్నయ్‌కి చెందిన ప్రముఖ మస్కిలోస్కెలిటన్ అంకో సర్జన్ డాక్టర్ ఆనంద రాజాతో పాటూ వైద్యులు శ్రీనాథ్‌గుప్తా, డాక్టర్ సృజన్ శుక్లా వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు



దగ్గుపాటి సురేష్‌బాబుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దుండిగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ నుంచి ఐఎస్ఓ 2001, 2018 ప్రమాణపత్రం లభించింది. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠ్యాంశాల రూపకల్పన, విద్యార్థులకు అనుకూలమైన విద్యాబోధనా పద్ధతులు, మంచి వనరులు, వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణం వంటివి విద్యాసంస్థలో ఉన్నందున ఈ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు ఆచార్య సీడీ నాయుడు, పరిపాలనా డీన్ ఆచార్య డాక్టర్ చెన్నకేశవరావు, సమన్వయ కర్త డాక్టర్ డీవీ చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పోర్టల్ సమస్యలు పరిష్కరించాలి'

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పథకం పోర్టల్‌లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీహరిబాబు డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో శనివారం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద అపార్ట్‌మెంట్లు, సొసైటీలలో సోలార్ ఎనర్జీ స్థాపన కోసం ఉద్దేశించిన దరఖాస్తులను పోర్టల్ అంగీకరించడం లేదన్నారు. సాధారణంగా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు డిస్కంలకు చెందిన ఏడీఈల లాగిన్‌లోకి రావాలి కానీ, అలా జరగడం లేదన్నారు. పోర్టల్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, డిస్కంలు ప్రత్యేక దృష్టిసారిస్తే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పరకాల రాజేష్, బాబునాయుడు పాల్గొన్నారు.

కల్కిని వీక్షించిన దర్శక, నిర్మాతలు

చిక్కడపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అమితాబ్‌బచ్చన్, దీపికా పడుకోన్, ప్రభాస్ నటించిన కల్కి సినిమాను ఆ సినిమా దర్శక, నిర్మాతలు వీక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు మొత్తం సినిమాను సినిమా దర్శక నిర్మాతలు నాగ్‌అశ్విన్, స్వప్నదత్, ప్రేక్షకులతో కలిసి చూశారు. థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్‌లు విశ్వంబర్, బాల్‌గోవింద్‌రాజు, మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ వారి వెంట ఉన్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి హైదరాబాద్ నార్సింగ్ సర్వీస్ రోడ్డులోని జయభేరి టెంపుల్ వీధికి చెందిన మాగంటి సత్యనారాయణమూర్తి, మధురావు కుటుంబసభ్యులు శనివారం రూ.40 లక్షలకు పైగా విలువగల బంగారు తాపడంతో చేసిన ఆభరణాలను సమర్పించారు. నాగాభరణం, జటాఝూటం, నాగపడగ, పానవట్టం, ధారపాత్ర, మకర తోరణం తదితర ఆభరణాలను ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు.

- విజయవాడ(వన్‌టౌన్), జూన్ 29(ఆంధ్రజ్యోతి)

59 జీవో ప్రకారం

అదనపు స్థలాల రిజిస్ట్రేషన్ చేయండి!

- జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ క్వార్టర్స్ కాలనీ వాసుల విజ్ఞప్తి
- 150 మంది రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూపులు



అదనపు స్థలాల్లో షెడ్‌లు ఏర్పాటు చేసుకున్న స్థానికులు

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ క్వార్టర్స్ ఇండస్ట్రియల్‌కాలనీలో అదనపు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 70 ఏళ్లుగా తమ నివాసాల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను కాపాడుకుంటూ వస్తున్నామని ప్రభుత్వం విడుదల చేసిన జీవో 59 ప్రకారం తమకు డిమాండ్ నోటీస్‌లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. 2016లో ప్రభుత్వం జీవో విడుదల చేసిన క్రమంలో దాదాపు 150 మంది నివాసులు తమ నివాసా ల పక్కనున్న 60 గజాలు, 70 గజాలు, 100 గజాలు, 120 గజాలు, 150 గజాల చొప్పున అదనపు స్థలాలను అప్పటి మార్కెట్ రేట్‌లో 25 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వివిధ కారణాల వల్ల మరో 150 మంది స్థానికులు తమ నివాసాల పక్కనున్న ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయారు. వీరంతా 2021లోనే అప్లికేషన్ పొందుపరిచి హిమాయత్‌నగర్ తహసీల్దార్‌కు పంపించారు. కార్మికుల కోసం నిర్మించిన క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారు ప్రస్తుతం రెవెన్యూ విభాగం ద్వారా తమ నివాసాల పక్కనున్న అదనపు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ చేయించుకోని నివాసులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. డిమాండ్ నోటీస్‌లు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కార్మిక కుటుంబాలవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు డిమాండ్ నోటీస్‌లు ఇచ్చి అప్పటి మార్కెట్ రేట్‌లో 25 శాతం తీసుకుని తమ ఇళ్ల పక్కనున్న అదనపు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారులు స్పందించాలి



రెవెన్యూ విభాగం అధికారులు వెంటనే స్పందించాలి. మూడు సంవత్సరాలుగా సమస్య నానుతోంది. పరిశీలన కూడా పూర్తయింది. డిమాండ్ నోటీస్‌ల వెంటనే ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి క్వార్టర్స్ వాసులు సిద్ధంగా ఉన్నారు. రిజిస్ట్రేషన్ చేయిస్తే ప్రభుత్వానికి కూడా రెవెన్యూ వస్తుంది.

- నర్మెట్ట మల్లేష్, రెసిడెన్షియల్ సొసైటీ అధ్యక్షుడు

30 అప్లికేషన్లు పరిశీలించి కలెక్టర్‌కు పంపాం

జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ క్వార్టర్స్ వాసులు తమ ఇళ్ల పక్కనున్న అదనపు స్థలాలను 59 జీవో ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 30 నుంచి 35 దరఖాస్తులకు సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేసి ఆర్‌డీవో ద్వారా జిల్లా కలెక్టర్‌కు పంపించాం. కొందరి అప్లికేషన్లు రిజెక్ట్ కూడా అయ్యాయి.

- సంధ్యారాణి, హిమాయత్‌నగర్ తహసీల్దార్

అదనపు స్థలాలకు ట్యాక్స్ కడుతున్నాం



తామంతా కార్మికులం. వీఎస్టీ కార్మికులు డీబీఆర్ మిల్లు కార్మికులు, ప్రాగాటూల్స్ కార్మిక కుటుంబాలు ఈ క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. 1952లో ప్రభుత్వం క్వార్టర్స్ అలాట్‌మెంట్ చేయడంతో అక్కడే నివాసం ఉంటున్నాం. అదనపు స్థలాల్లో 30 సంవత్సరాలుగా నివాసం ఉంటూ ఆ తాత్కాలిక ఇళ్లకు కూడా మున్సిపల్ ట్యాక్స్ కడుతున్నాం. 59 జీవో ప్రకారం అదనపు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రభుత్వం సహకరించాలి.

- మారిశెట్టి నర్సింగ్‌రావు, రెసిడెన్షియల్ సొసైటీ సలహాదారు



నిజాం కళాశాలలో నిర్వహించిన సహజ యోగాలో యోగా గురువులు

నిజాం కళాశాలలో సహజ యోగా

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి సహజ యోగా ద్వారా వచ్చే ప్రశాంతత, ఆనందాన్ని అందించడానికి మూడు రోజులుగా హైదరాబాద్ రియలైజేషన్ టూర్‌ను పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం కాచిగూడ నుంచి నిజాం కళాశాల వరకు యోగా గురువులు, ధ్యానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిజాం కళాశాల మైదానంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి యోగాసానాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సహజ యోగా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గౌరు కృష్ణ మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరు ఆచరించి మంచి ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో సహజయోగ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయాలి



జోనల్‌కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రానున్న బోనాల పండుగ సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని డివిజన్ కార్పొరేటర్ పావనీ నివినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కోరారు. శనివారం కమిషనర్ రవికిరణ్‌తో సమావేశమయ్యారు. బోనాల సందర్భంగా అమ్మవారి ఆలయాలవద్ద మట్టి, చెత్త తొలగించేందుకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని విలేకరులతో మాట్లాడుతూ జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, వాటితోపాటు పండుగకు చేసే ప్రత్యేక ఏర్పాట్లను మొదలుపెడతామని హామీ ఇచ్చారని తెలిపారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

- ధర్నాలో పలువురు నేతల డిమాండ్



ఇందిపార్కువద్ద జరిగిన ధర్నాలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నేతలు

కవాడిగూడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన ప్రజాశక్తి తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు నల్ల లక్ష్మణ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రకుల నిరుపేద వర్గాల హక్కుల ఉద్యమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. బీసీ సంఘం నేత వీజీఆర్ నారగోని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రమేష్ కుమార్‌మాదిగ, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్, బహుజన ప్రజాశక్తి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో ప్రైవేట్ యాజమాన్యాల అజమాయిషీ పెరిగిపోవడంతో బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చేంతవరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. రాష్ట్రంలోని యూనివర్శిటీలను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి, నాయకులు ప్రదీప్, చింతకింది రమేష్, బాలనర్సింహ, స్వామి, భూషణ్, నర్సింగ్‌రావు. నాగేష్‌తో వివిధ జిల్లాల నుంచి వివిధ సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రామకృష్ణమఠం సమావేశంలో మాట్లాడుతన్న మహేష్ భగవత్

జీవితంలో రిస్క్ తీసుకోవాలి

- మహేష్ భగవత్

కవాడిగూడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీవితంలో రిస్క్ తీసుకోవాలని అదనపు డీజీపీ మహేష్ భగవత్ యువతకు పిలుపునిచ్చారు. రిస్క్ తీసుకుని ప్రయత్నిస్తే విజేతలు అవుతారని, లేదంటే అనుభవజ్ఞులు అవుతారని సూచించారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో జరుగుతున్న శౌర్య శిబిరాన్ని సందర్శించి ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. యూపీఎస్‌సీ విద్యార్థులకు ఇంటర్వ్యూని ఎదుర్కొనే విషయంలో ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు. కోచింగ్ కోరుకునే పేద విద్యార్థులు 9440700105 వాట్సాప్ నంబర్‌కు వివరాలు పంపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు అనుసరిస్తూ జీవితాలను ఉద్ధరించుకోవాలని పిలుపునిచ్చారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం: కార్యదర్శి

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం కృతనిశ్చయంతో పనిచేస్తామని రాష్ట్ర కార్మికశాఖ నూతన కార్యదర్శి సంజయ్‌కుమార్ అన్నారు. నూతన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు తీసుకున్న సంజయ్‌కుమార్ శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో కార్మికశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్మికశాఖలో పెండింగ్‌లో ఉన్న కార్మికుల ఫైళ్లు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఎల్‌వోసీ అందజేత



కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అంబర్‌పేటకు చెందిన ఆలోక్‌కు శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం లక్ష రూపాయల ఎల్‌వోసీ లెటర్‌ను అందజేసిన అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

ఎంపీ ఆర్. కృష్ణయ్యకు భారతరత్న ఇవ్వాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యమ నేత ఎంపీ ఆర్. కృష్ణయ్యకు భారతరత్న ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీలకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం కన్వీనర్ టి. రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం రాష్ట్రపతి, ప్రధానికి ఆయన లేఖలు రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు రాజ్యాంగ పరంగా రావాల్సిన హక్కులు, నిధులు, రాజకీయ వాటా కోసం నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న వ్యక్తి ఆర్. కృష్ణయ్య అని అన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తున్న ఆయనకు భారతరత్న అవార్డుకు నిజమైన అర్హుడని అన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సమైక్యంగా పాదముద్రలు, అభినయంలో స్పష్టత, నర్తకీమణులు చూపిన ఏకాగ్రతతో ప్రతి నాట్య అంశం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రఖ్యాత ఆలయ నృత్యకళాకారిణి వోలేటి రంగమణి, ఆమె కుమార్తె రేఖల శిష్య బృందం కూచిపూడి నాట్య నీరాజనం పేరిట ప్రదర్శించిన నాట్యాంశాలు గురువుల శిక్షణకు అద్దం పట్టాయి. అరుదైన ఆలయ నృత్యంలో ప్రావీణ్యురాలైన రంగమణి, రేఖల శిష్యురాళ్లు వైష్ణవి, ప్రవలిక, మధుమిత, శ్రీనికలు సింహనందిని అంశాన్ని అపూర్వంగా నర్తించారు. తెల్లటి తివాచీపై రంగులు చల్లి వేదికపై పరచి దీనిపై నర్తకీమణులు లయబద్ధంగా నర్తిస్తూ తమ పాదముద్రలతో తివాచీపై సింహం చిత్రాన్ని రూపొందిస్తారు. పదిహేనుమంది నర్తకీమణులు ప్రదర్శించిన నాట్యప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ఏపీఎన్‌రాజును సన్మానిస్తున్న శ్రీకాంత్

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయశాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా ఏపీఎన్ రాజు నియమితులైన సందర్భంగా ఆయనను శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను డైరెక్టర్‌కు వివరించామని ముఖ్యంగా ఉద్యోగ రెగ్యులైజేషన్ వంటి సమస్యలు వివరించామన్నారు. డైరెక్టర్‌ను కలిసినవారిలో రామాంజనేయరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ప్రైవేటు ఆస్పత్రులు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గంగపుత్ర సంఘం హాల్‌లో సొసైటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్టార్ ప్రేమ్ హస్పటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అండగా నిలవాలి అన్నారు. వైద్య శిబిరంలో ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, గైనిక్ పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా, ఎస్ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, జునేద్ బాగ్దాదీ, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అర్చకుల సేవలు నిరుపమానం

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో అర్చకుల సేవలు నిరుపమానమైనవని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేసిన కాందూరి కృష్ణమూర్తి పదవీ విరమణ సందర్భంగా ఆలయ ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో ముఠా గోపాల్ కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో తోటి అర్చకులు వెంకటాద్రి, ఆచార్య, శివ, పావని, మాజీ ధర్మకర్తలు జానకి సుధాకర్, ముచ్చకుర్తి ప్రభాకర్, పద్మ, మురికి గణేష్, శ్యామ్, దేవాలయ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. కృష్ణమాచారి, గ్రేటర్ అధ్యక్షుడు జగపతి పాల్గొన్నారు.

కృష్ణానగర్ బస్తీ అధ్యక్షుడిగా శాంతికుమార్

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని కృష్ణానగర్ బస్తీ అధ్యక్షుడిగా వై. శాంతికుమార్ ఎన్నికయ్యారు. ఆయనను శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ కృష్ణానగర్ బస్తీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అధ్యక్షుడుగా ఎన్నికైన వై.శాంతికుమార్ మాట్లాడుతూ బస్తీ ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి సమస్యల పరిష్కారం, బస్తీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, స్వామిరావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

పేదలు నివసించే ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించాలి

- ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరాలంటే ధనికులకే కాదు శ్రామికులకు కూడా. పేదలు నివసించే ప్రాంతాల్లో సదుపాయాలపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో 'నగరీకరణ ప్రభుత్వ విధానాలు - ప్రత్యామ్నాయాలు' అనే అంశంపై సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామికులు లేకుండా నగరాల అభివృద్ధి లేదని, శ్రామికులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి వారు కూడా ఆనందంగా జీవించేలా చర్యలు చేపట్టాలన్నారు. భూ వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా నగరాల అభివృద్ధి వ్యూహం ఉండకూడదన్నారు. పట్టణ విధానాల నిపుణులు డాక్టర్ డి. నర్సింహారెడ్డి మాట్లాడుతూ నగరాల అభివృద్ధి సహజంగా జరగడం లేదని, ప్రభుత్వాలు బలవంతంగా గ్రామాలను విలీనం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇందీవర్, డీజీ. నరసింహారావు, సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, ఎం. దశరథ్, ఎం. మహేందర్, కె. ఎన్. రాజన్న, నాగలక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

సౌత్ గ్లాస్ కంపెనీలో మృతి చెందిన కార్మికులకు రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

- ఇఫ్టూ నేతల డిమాండ్

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లలో బూర్గులలో ఉన్న సౌత్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో దేశంలోని బీహార్, యూపీ, ఒడిస్సా, బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది జీవనోపాధి కోసం వచ్చి పనిచేస్తుండగా ఇక్కడ జరిగిన ఘటనలో మృతి చెందిన కార్మికులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వాహనాల గ్లాసుల తయారీ పరిశ్రమలో ఈ నెల 28న జరిగిన పేలుడులో 5 మంది కార్మికులు మరణించడం, మరో ముగ్గురు కార్మికుల ఆచూకీ తెలియకపోవడం విచారకరమన్నారు.



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

కార్మికశాఖ కమిషనరేట్ వద్ద కార్మిక సంఘాల ధర్నా

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐటీ, ఐటీఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలను మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 5ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక శాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు జె. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ రమ, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 5 ప్రకారం మరో నాలుగేళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, ఐటీఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలను సడలిస్తుందని ఆరోపించారు.